దారితప్పిన కథ

డి. యస్. ఆర్. మయ్యకు - అంటే దశరథ రామయ్యకు పెళ్ళాం అంటే అసహ్యం, ఉద్యోగం అంటే రోత, పిల్లలంటే డోకు, ప్రపంచం అంటే జుగుప్స కలిగింది.

మయ్యకు కలిగిన ఈ వికారానికి కారణం ఫలానా అని ఇదమిద్ధంగా చెప్పలేక పోతున్నాడు.

క్రోధి, విరోధి, వికార, రాక్షస నామ సంవత్సరాలలో ఏదో ఒకదాంట్లో పుట్టాడేమో!

ఇరవై ఏళ్ళనుండీ పెళ్ళాంతో వ్యభిచారం సాగిస్తున్నాడు. ఆనాడు-అంటే కార్యంరోజు పెళ్ళాన్ని తన గదిలోకి నెట్టి అమ్మలక్కలు తలుపులు బిగించినప్పుడే అసహ్యం కలిగింది. అప్పటినుండి ఏక స్త్రీ వ్యభిచారం చేస్తూనే ఉన్నాను. అప్పుడప్పుడు కొంతమంది పిల్లలు కూడా పుట్టారు. పెరుగుతున్నారు.

మయ్య, యమ్మే ప్యాసలయిం తరువాత కళుక్కర్తి కొద్దీ పెళ్ళయిన కొత్తల్లో ఓ గుమాస్తాగా చేరాడు. చేరిం తరువాత ప్రతి తద్దినానికీ ఇచ్చే ఇంక్రిమెంట్లు తప్ప చెప్పుకో దగ్గ ప్రమోషనేదీ రాలేదు. మరీ గుమాస్తా కాకుండా, మరీ ఆఫీసరు కాకుండా మధ్యలో ఊగిసలాడుతున్నాడు. తను

ఓ మేధావిని అని అనుకుంటూ ఉంటాడు. ఇతరులు ఇది గుర్తించలేదు. అందుకనే వాళ్ళు వెధవలు అతని దృష్టిలో. ఉద్యోగాలకు మస్తిష్కంతో-బొత్తిగా పనిలేదు. అందరి లాగా, బాస్‌కు అవసరమున్నప్పుడు, లేనప్పుడూ సలాంలు కొట్టి—బాస్ తాగితే తను తాగి...తాగించి, ఆయన మేకను కుక్క అన్నా, కుక్కను మేకన్నా వినయవిధేయల్తో తలూపి—ఇలాంటి పనులు చేయలేదు.

ఉద్యోగం దొరికినప్పుడు పదిరూపాయలకు చిన్న ఇల్లు కూడా దొరికింది పెంకుటింట్లో ఒక పక్కభాగం. మధ్యలో తడిక పెట్టి ఒక గదిగా చేసి ఇచ్చారు ఇంటివాళ్ళు. అది మయ్యూ బెడ్ రూమ్. తడికలోంచి అప్పుడప్పుడు చూస్తున్న పక్కింటి లావుపాటి లక్ష్మీకాంతమ్మను లాగి తందామనిపించేది మయ్యూకు...ఒకటి రెండుసార్లు తన్నాడు కూడా తడికను. ఉద్యోగంలో పెరిగిన హోదాతో హుందాగా తరువాత చాలా ఇళ్ళు మారాడు మయ్యూ మంచి ఉద్యోగం-మంచి భార్య-చిలకా గోరింకల్లా సంసారం-మయ్యూ చేస్తున్న వ్యభిచారాన్ని గురించి ఇరుగు పొరుగువాళ్ళు అలా చెప్పుకునేవాళ్ళు. పగలల్లా ఆఫీసులో పనిచేసి, ఆలోచనలతో బుర్ర వేడెక్కి, రాత్రి అయ్యేసరికి తడికెల గదిలో చేరుతాడు. మయ్యూ పెళ్ళాం కూడా పగలల్లా వంట ఇంట్లో సతమతమై చాకిరి చేసి చేసి (గంపెడు సంసారం) రాత్రి అయ్యేటప్పటికి ఆ గదిలో చేరుతుంది. ఇద్దరూ అక్కడ కలుసు కుంటారు. తెల్లవారితే ఎవరిదారి వారిది. ఎవరి పనులు వాళ్ళవి. గడియారం ముల్లులా తిరుగుతూనే ఉంటారు.

ఇక తను చూసే ప్రపంచం సంగతి చూస్తే-

న్యాయం. నీతి, నిజాయితీ, ధర్మం... మంచి... ఇలాంటివి కనపడతై అని కళ్లు పెద్దవి చేసుకుని చూస్తూనే ఉన్నాడు. ఇవన్నీ ఎక్కడో నక్కినై. అతనికెక్కడా కన్పించ లేదు. అతనికెక్కడా కన్పించలేదు. అతనికి కన్పిస్తున్నదల్లా దీనికి పూర్తిగా వ్యతిరేకమైనవే. తనలాంటి దృక్పథం కల వాడు నూటికి కోటికి ఎవడన్నా ఉంటే వాణ్ణి- అసమర్థుడనీ, పనికిరాని వాడనీ, వాజమ్మ అనీ, ఇంకా ఇలాంటి పేర్లేవో పెట్టి తరిమి తరిమి కొడ్తారు. తనదీ ఈ విషయంలో మైనారిటీ పక్షం అయిపోయింది.

తన ఉద్యోగాన్ని, సాగిస్తున్న సంసారాన్ని (అతని దృష్టిలో అది వ్యభిచారమే) తన కెదురుగా కన్పిస్తున్న ప్రపంచాన్ని చూసి విరక్తి చెంది ఈ ఊబిలోంచి తప్పించుకు బయటపడ్డానికి సన్యాసం పుచ్చుకోవాలనుకున్నాడు. ఒక రిద్దరు స్వాముల వార్లను కలుసుకుని మాట్లాడాడు దీని మంచి చెడ్డలు.

ఒక స్వాములవారు చెప్పిన మాటలు విని ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

మనిషంటూ వుంటే కోరికలు లేకుండా ఉండవు. స్వాములవారు మనిషే, కొద్దో గొప్పో కోరికలుంటాయి. చీమునెత్తురూ ఉన్నదిగామరి...ఉన్న కలని పూజలనీ, పునస్కారాలనే పేరుతో ఉంచటానికి సాధ్యమైంతవరకు ప్రయత్నిస్తారు. మయ్యా తెలుసుకున్న నిజం ఇది. కాషాయ

స్త్రీలు, కమండలం లేకుండానే సంసారంలో ఉంటూ సన్న్య సించడానికి ప్రయత్నం చేయచ్చు. ఆ స్వాములవారిచ్చిన సలహా...

మయ్యా, యమ్మో చదివేటప్పుడే- అతని నెత్తురు కూడా మెదడులోనూ పురుగు ప్రవేశించి క్రమేణాదయి ఓ వ్యాధిగా తయారైంది. క్షయవ్యాధి ఉన్న భయంకరమైన వ్యాధి. ఈ వ్యాధితో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. మనిషిని కుంగతీసింది. తనెవరో పంజరంలో తాళ్ళతో బంధించినట్టు- తాళ్ళను నరకాలని- పంజరంలోంచి బయట పడలని. ఇదీ అతని వ్యాధి...ట్రెడిషన్ అంటే బొత్తిగా నమ్మకంలేదు. దీన్ని బ్రేక్ చెయ్యాలని కంకణం కట్టుకున్నాడు అతని మెదడులో ప్రవేశించిన పురుగు ఇదే. దీన్ని మొదట్లో టి. బి. అని (ట్రెడిషన్ బ్రేకర్) ఈ పేరు బలే బాగుంది అని నవ్వుకున్నాడు. నేను టి. బి. పేషంటుగా మరి. నా ఊపిరితిత్తులు బాగానే ఉన్నాయి, టెంపరేచర్ ... ఇదో రక మైన టి. బి. అని అనుకున్నాడు. మయ్యకు పెళ్ళికి ఎదిగి కూర్చున్న కూతురున్నది. కాస్తోకూస్తో చదువుకున్నది. ఆ అమ్మాయికి పెళ్ళి చెయ్యాలంటే బోలెడు కట్నం పొయ్యాలి. అంతకట్నం తీసుకుని ఆ అమ్మాయిని సరిగా చూస్తారో లేదో. ఏదో ఒక చిన్న విషయానికి కోపంవస్తే పుట్టింటికి పంపిస్తాడు. తీసుకు వెళ్ళవయ్యా అల్లుడా అని అడిగితే. కొంత పైకము చెల్లించమనో- లేకపోతే ఒక వస్తువు కొనిపెట్టమనో-

(కనీసం స్కూటరులాంటిది) బేరం చేస్తాడు. అల్లుడుకోరిక నేరవేరకపోతే అమ్మాయి పని ఖాళీ ... ఎన్నాళయినా పుట్టింట్లోపడి యుండవలసిందే. ఇదో రకమైన ధవ్యం (భర్త బ్రతికి వుండగా) కట్నం సంగతి అలావుండగా పెళ్ళిఖర్చు బోలెడు. పెళ్ళికి ముందురోజు ఈనాడు పెళ్ళి తర్వాత... బంధువులంతా పిల్లా వంకతో వచ్చి విందులన్నీ ఆరగించి. పోతూ పోతూ ఏదో కొంటెమాట మాట్లాడిపోతారు. వంట బాగాలేదనో, విడిదిలో ఎరేంజ్‌మెంట్స్ బాగా లేవనో లేక పోతే మర్యాదలు సరిగ్గా జరపలేదనో. ఇలాంటివి. అందరూ చేసినట్టు గాకుండా ప్రత్యేకమైన పద్ధతిలో మయ్య కూతురు పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాడు. కాని సాధించగలనన్న ధైర్యంలేదు. ఈ ఇరవై యేళ్ళలోనూ అనేక విషయాల్లో ట్రెడిషన్ బ్రేక్ చెయ్యాలని చూస్తూన్నాడు. అన్నిట్లోనూ అపజయమే ఎదురవుతూ ఉన్నది.

పెళ్ళాం తనని దైవంగా చూస్తుంది. అదే అతనికి నచ్చదు. అతని దృష్టిలో పెళ్ళాం పెళ్ళాంలా అన్పించదు. దేవతలా అసలే కన్పించదు.

పెళ్ళి కంట్రాక్టు ప్రకారం, పెళ్ళాం అవసరమొచ్చి నప్పుడల్లా ఆనందాన్నిచ్చే వస్తువు. ఇది ఖరీదులేని ఆనందం- ఇద్దరిలో ఏ ఒకరికి ఇష్టం ఉన్నా లేకపోయినా- భార్యా భర్తల యంత్రం మాత్రం నిరాఘాటంగా తిరుగుతూనే ఉంటుంది. తిండీ, గుడ్డా, పండక్కీ పబ్బానికీ- ఒకటో రెండో కొత్త చీరెలు...ఇవీ ఆమెకిచ్చే పారితోషికం.

ఎన్నో దీపావళులు ఉగాదులు వెళ్ళిపోయినాయి. ఈ పండగలన్నా, పండగలకు కలవలన్నా మయ్యకు మహా కోపం. ఇది దీపావళి కాదు. దగావళి అంటాడు. ఆ కోపం ఎవరిమీదనో ఏమిటో తెలియదు. పెళ్ళాన్ని తిట్టినా, కొట్టినా, చీదరించుకున్నా ఆవిడ ఏమీ అనదు. తిరగబడదు. మళ్ళీ గదిలో తయారు. ఎప్పుడూ మాంగల్యం కళ్ళకద్దుకుంటూ ఉంటుంది. తను తిరగబడే స్వభావం కలవాడు. ఆవిడది దానికి పూర్తి వ్యతిరేకం. అందుకనే పెళ్ళాం అంటే అసహ్యం పుట్టిందేమో.

ప్రతి రోజూ పేపరు చూస్తుంటాడు మయ్య, టెలివిజన్ లోలాగా అతని కంటికి నడుస్తున్న చరిత్ర కన్పిస్తుంది. పళ్ళు పటపట కొరుకుతాడు. మయ్యకు ఏవో కోరికలున్నాయి...

చిన్న చిన్న గుడిసెల్లో కొంతమంది-పెద్ద పెద్ద మేడల్లో కొంతమంది ఉండగూడదు. పేవ్‌మెంట్లమీద పడుకుని ఎవరూ దిక్కులేని చావు చావకూడదు. బతికున్న శవాలను రిక్షాల్లో వేసి మనుష్యులు లాగకూడదు. ఆఫీసుల్లో పని చేస్తున్న ప్రతి చిన్న ఉద్యోగి ప్రతిరోజూ మల్లెపూవులాంటి తెల్లని ఇస్త్రీ మడతలు వేసుకుని ఠీవిగా ఉండాలి. ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న వాళ్ళున్నారు. వాళ్ళ సంతోషం చిమ్నీల్లోంచి బయటకు వచ్చి ఆకాశం అంతా వ్యాపించాలి. భూములన్నీ విపరీతంగా పండాలి ఎక్కడ చూసినా ఆకుపచ్చ ప్రపంచమే కన్పించాలి. తిండి లేకుండా యెవ్వడూ మాడి చావకూడదు. ఇలా చెప్పుకుపోతే ఎన్నో ఉన్నాయి.

అతనికి కనిపించేదల్లా, గుడినీ గుళ్ళో లింగాన్ని మింగే తిమింగలాలు, మనుష్యుల్ని పీక్కు తినే క్రూర జంతువుల్లాంటి పెద్ద మనుష్యులు

ఈ తిమింగలాల్లోనుంచి బయటపడదామనే ఓ సారి ఏ అడవుల్లోకన్నా వెళ్తే బావుండుననుకున్నాడు. ఏ జింక చర్మమో ఒంటికి కప్పుకుని అడవిలో దుంపలూ, కాయలూ, పళ్ళు తిని కాలక్షేపం చేయవచ్చు. పులులూ, సింహాలూ, క్రూరజంతువు లుంటాయిగాని అవే నయం. ఆకలైతేగాని మీదికి రావు. తనొకడూ వెళ్ళి ఆ అడవిలో ఏం చేస్తానని. ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. ఎక్కడికి వెళ్ళినా పెళ్ళాం. పిల్లలూ వెంట వస్తామంటారు. పెళ్ళికి వెళ్తూ పిల్లిని చంకను పెట్టుకు వెళ్ళినట్లు!...ఛ... అనుకున్నాడు.

ఏవీ చేయలేక చచ్చిపోదామనుకున్నాడు. ఛస్తే తన మీదపడి ఏడుస్తారు పెళ్ళాం పిల్లలూ, తనుపోతే, వాళ్ళని ఎవరూ పట్టించుకోరు. ప్రావిడెంట్ ఫండ్ డబ్బు పెళ్ళాని కివ్వడానికి చాలా తిప్పలు పెడ్తారు. పెళ్ళానికి వేరే ఆధారం ఏమీ వుండదు. ఎవ్వరూ మొగుడు చచ్చిన వాళ్ళను గురించి పట్టించుకోరు. చచ్చి సాధించేదేమీలేదు అందుకని మయ్యా చావలేదు.

నా దగ్గర కోసారి మయ్యా తన గోడంతా చెప్పు కున్నాడు. చిక్కి సగమైనాడు. టి. బి పేషంటులా ఇలా తయారయ్యావేమిటి? కొంచెం ఆరోగ్యం జాగ్రత్త... అన్నాను.

"నాకో తరుణోపాయం చెప్పవయ్యా" అన్నాడు.

నేనేమీ మాట్లాడలేదు.

"నీవు కథలు రాస్తావుగా...నన్ను గురించి ఓ కథ రాయి.. నాలాంటి వాళ్ళెవరన్నా ఉంటే చదువుతారు..." అన్నాడు.

నిన్ను గురించి రాసిన అది కథ ఎలా అవుతుంది? కథ మజాకా అనుకున్నావా? ఓ బలమైన సంఘటన ఉండాలి. క్లయిమక్స్ ఉండాలి. ముగింపులో కొంత ట్విస్ట్ ఉండాలి. ఆడవాళ్ళుండాలి. గాజుల గల గల ఉండాలి. ప్రేమ వలకపోయ్యాలి...ఇన్ని ఉంటేగాని కథగాదు. పాఠకుల అభిరుచి ననుసరించి కథ రాయాలి. లేకపోతే ఎవరూ చదవరు. పత్రికల వాళ్ళు అసలు వేసుకోరు...నీలాంటివాడి మీద కథ రాస్తే...రాసేవాడి పరువుపోతుంది. నేరుగా బుట్టదాఖలా అవుతుంది..." అన్నాను.

"అంతేనంటావా?" అన్నాడు జాలిగా.

నాకు నిజానికి మయ్య మీద జాలేసింది.

కథ వ్రాయటానికి ప్రయత్నించాను గాని! బలమైన సంఘటన దొరకలేదు.

"నా జీవితమంతా ఓ సంఘటన నేకదా?...పోనీ ఏదో కథ రాసి నాలాంటి వాణ్ణి ఇరికించగూడదూ?" అన్నాడు.

"కథ రాస్తే మంచి బిగువుగా ఉంటుంది. నీలాంటి వాణ్ణి ఇరికించడానికి వీలుండదు" అన్నాను.

మయ్య నన్ను వదల్లేదు.

"కథల్లో పోనీ క్రెడిషన్ బ్రేక్ చెయ్యరాదూ" అన్నాడు.

"అది సులభమా! అందరూ దుమ్మెత్తి పోస్తారు. సంపాయించుకున్న ఆ కాస్త పేరు మట్టికొట్టుకుపోతుంది. నీ మూలంగా నా పేరును నేను త్యాగం చెయ్యలేను" అన్నాను.

"కథలు రాసేవాడిని నీలో ఇంత స్వార్థం ఉంటుందను కోలేదు" అని నన్ను తిట్టాడు.

కళ్ళు ఎర్రచేశాడు.

తల అటూ ఇటూ ఊపాడు.

మనిషంతా కదిలాడు.

అతని దగ్గర ఏమీ ఆయుధం లేదుగాని, ఉంటే నన్ను హతమార్చేవాడు.

అంత రౌద్రాన్ని కళ్ళల్లో నే నెప్పుడూ చూడలేదు.

తిట్టిన తిట్లన్నీ తిన్నాను. కొన్ని మింగుడు పడ్డయ్... కొన్ని పడలేదు. దెబ్బతిన్న పులల్లే ఎగిరి గంతేశాను. గాయ పడిన పులి మనుషులను తింటుందిట-మరి నేనో...

ఇది కలికాలం-

నాలుగు పాదాలలో ధర్మదేవత ఒక పాదంతో కుంటుతూ నడుస్తున్నది. ఆ కుంటికాలు కూడా దెబ్బతిన్నది. ఓ పులి నమిలేసింది. తోలు ఊడిపోయి ఎముక వేళ్ళాడు తున్నది. నడవడానికి పట్టుచిక్కడంలేదు. ఆ వేళ్ళాడుతున్న కాలిని పట్టుకుని వేళ్ళాడుతున్నాడు. మయ్య.

మయ్యలను గురించిన కథ రాయడానికి ప్రయత్నం చేస్తున్నాను. కలం కదల్డంలేదు. మాటలు పెకల్డంలేదు.

కథ రాద్దామని ఆలోచిస్తుంటే కల వచ్చింది. నేను కథలో పరిచయం చేద్దామనుకున్న మయ్యా కలలో కన్పించారు. మయ్యలతో పాటు మరో పదిమంది అలాంటివాళ్ళు పళ్లు పట పట కొరికారు వాళ్ళ కళ్ళు రక్తపు బంతులవల్లే ఉన్నాయి. కొండలమీద కత్తులు నూరుతున్నారు. పదునెక్కి తళ తళ మెరుస్తున్నాయి...ఒక్కో కత్తి భూమండలాన్నంతా ఛేదించేట్టుగా వుంది.

చీకటి మొలకలెత్తి... పెద్ద వృక్షమై...కొమ్మలూ ఆకులూ ఆకాశాన్నంతా వ్యాపించినై, ఆకాశం బద్ధలైంది... పెనుగాలి...రాక్షసిలాగా వర్షం విరుచుకుపడ్డది. పగలు రాత్రి తెలియకుండా చీకటి కమ్మేసి వర్షం ఎన్నిరోజులు కురిసిందో చెప్పలేను. అంతా జలమయం. భూమి కన్పించడం లేదు. మయ్యాల వాళ్ళు కొండగుహల్లో దాక్కున్నారు. వాళ్ళల్లో కొంతమంది ఆడవాళ్ళు, మొగవాళ్ళు ఉన్నారు. చివరకు మిగిలింది వాళ్లే...

వర్షం కురిసికురిసి - విసుగుపుట్టి- అలసి సొలసి శ్వాస అందక రొప్పుతూ- రొప్పుతూ-ఆయాసంతో ఆగిపోయింది. ఆ కొండగుహలో ఎక్కడో ఓ వెలుతురు కిరణం బాణంలా చొచ్చుకుపోయింది. ఆ ఆడవాళ్ళలో కడుపుతో ఉన్న ఒక ఆమె భళ్ళున తెల్లవారినట్టుగా ప్రసవించింది. పసిపిల్లవాడి

ఏడుపు ప్రపంచం అంతా వినిపించింది...కొండల్లో ప్రతి ధ్వనించింది...వాళ్ళందరూ కొండల్లో కాపరం పెట్టారు...

ఇంతలో మెత్తని చెయ్యి-ఏదో స్పర్శ సుఖం.

"ఎంత ఆదివారం అయితే మాత్రం. ఇంతసేపు పడు కుంటారా, ఇంక లెద్దురూ. ఇడ్లీ చల్లారిపోతున్నది. చక్కటి కాఫీ మీ కోసం ఎదురు చూస్తున్నది" అంటున్నది మా ఆవిడ.

అబ్బ ఉండు అని నా మీదికి లాక్కున్నాను.

"ఏమిటి మరీ చిన్న పిల్లలై పోతున్నారు. ఎంత కథకు లైతే మాత్రం" అంటూ తప్పించుకు పోయింది. కల విరి గింది. ఆమె చెంగు పుచ్చుకుని వంట ఇంట్లోకి తరుముతూ పరుగెత్తాను. ఇదీ కథ అంటూ!!

కాఫీ సేవిస్తూ కల సంగతి, కథ సంగతి చెప్పాను మా ఆవిడతో.

"అదేం కథ, పిచ్చి కథ, ఎందుకొచ్చిన కథలివి. పుణ్యమా, పురుషార్థమా, మీ బుర్ర చెడగొట్టుకోవడం తప్ప విసురుగా అన్నది ఆవిడ.

"నేను కాస్తో కూస్తో పేరున్న కథకుణ్ణి కదా! ఒక్క మాటలో నన్ను తీసేశావే! నా విలువ నీకేం తెలుసు!" అన్నాను గర్వంగా.

"బాగా తెలుసు, ఒక కథరాస్తే ఒక ప్యాకెట్టు సిగ రెట్లు కాలుస్తారు. ఆ కథ ఓ పత్రికకు-పంపించి ఇంకా పడ లేదే. ఇంకా పడలేదే అని కాలుగాలిన పిల్లిలా అటూ

యిటూ తిరుగుతారు-అవునూ, ఓ సంగతి అడుగుతాను. ఈ కథల వల్ల ఏమిటి ప్రయోజనం?" అన్నది

ఇక ఆవిడకు నేనేం సమాధానం చెప్తాను...

కాని దశరథరామయ్యను నేను వదలదల్చుకోలేదు.

పెళ్ళాం అంటే అసహ్యం, ఉద్యోగం అంటే పిల్లలంటే చీకు, ప్రపంచం అంటే జుగుప్స రామయ్యను గురించి కథ ప్రారంభించాను. అతను కనీసం పుచ్చుకోవడానికి ప్రయత్నం చేయడం అతనిలో కాపురం పెట్టాలనుకోడం. ఓసారి ఆత్మహత్య ప్రయత్నం చేసి విరమించుకోవడం. ఇలాంటి ప్రకటనలు కథలో గుప్పించాను. మంచి ముగింపు అని ముచ్చటపడ్డాను. కాని- అది కుదిరిచావలేదు. ఆ విధంగా ముగించాను. పత్రికకు పంపాలని ఆరాటం. పంపించే ముందు కొంతమంది రచయిత మిత్రులకు చదివి వినిపించాను.

"ఈ కథలో నీవు చెప్పదలుచుకున్న దేమిటి?" అని ఒకరడిగారు.

నీ కథలోని పాత్రను ఓ అనార్కిస్టుగా, డిఫీగా చిత్రించావు. అదేం బాగాలేదు..." అని ఒకరన్నారు.

"దీనిలో సిద్ధాంతం ఏమిటి?" అని ఒకరు అంతం చేశారు.

ఈ ప్రశ్నలకు తట్టుకోలేక తెల్లమొగం వేశాను. వాళ్ళు నన్ను వదల్లేదు.

"సంప్రదాయాన్ని వ్యతిరేకరించిన మయ్యా చివరికి జీవితంతో రాజీపడ్డాడు గదా...రచయితగా దాన్ని సమర్థిస్తావా..." అని ఒక క్రిటిక్ నన్ను నిలదీశాడు.

ఈ కథ రాసినప్పుడు ఇన్ని ప్రశ్నలు నన్ను ఎదుర్కొంటాయి అని నే ననుకోలేదు. ఓరకంగా ఆలోచిస్తే నే నోడిపోయానేమో ననిపిస్తుంది.

కథలో సంసారాన్ని వ్యభిచారం అని అన్నాను. ఆ మాటకు నన్ను కాకులు పొడిచినట్లు పొడిచారు. మా సమావేశం ముగిసింది. నేను కొంత నిరుత్సాహపడ్డమాట నిజమే గాని... అయినా...ఓ... పత్రికకు పంపించిచూస్తే...అని అనుకున్నాను. నిబంధనల ప్రకారం తగినన్ని స్టాంపులు పెట్టి, లోపల నా అడ్రసుగల మరో కవరు పెట్టి పంపించాను.

ఓ నెలరోజుల తరువాత తాపీగా తిరిగొచ్చింది. దాంతో మా ఆవిడకు మరీ చులకనైనాను. నా అహం దెబ్బ తిన్నది. మయ్యను చిత్రవధ చేయాలనిపించింది. అదెంత సేపు-నాకు ఆయుధం వుండనే వుందికదా అనుకున్నాను.

మయ్యకు పెళ్ళానికి మధ్యన ఓ ప్రేయసిని యిరికించాను. ఆవిడ మరీ సన్నగా వుండేదేమో-ఆ ఊహాసుందరి వయ్యారంగా ఒదిగిపోయింది. వరిద్దరూ కనీసం వారానికి రెండుసార్లన్నా పార్కులో కలుసుకుంటారు. నీవు లేని నా జీవితం వృధా అంటాడు మయ్య, నేనూ అంతే అంటుంది.

ఆమె ఇద్దరూ చిలకల పలుకులు పలుకుతారు. ఒకరిమీద ఒకరు ఒరుగుతారు. వాళ్ళిద్దర్నీ మన్మథుడు బాధిస్తాడు. మయ్యాకు యిదివరకే పెళ్ళయిందని ఆ భామకు తెలియదు బస్సు స్టాప్ దగ్గర అడపాదడపా కలుసుకుంటూ ఉంటారు. వాళ్ళ ప్రేమ పాకంలో పడింది. ఆ చిన్నది ఎక్కడో ఉద్యోగం చేస్తున్నది. మయ్యాను గొప్ప మేధావిగా గుర్తించింది. ఓసారి అతని ఒడిలో తలదాచుకుంటూ. మీరు "జీనియస్" అంటే అదేం ఉత్ప్రేక్ష కాదు అన్నది. జీనియస్నూ మామూలు మనిషీ పెనవేసుకున్నారు. చుట్టూ వున్న ప్రపంచాన్ని మరిచారు. ఇలాంటి సంఘటనల వర్ణనలతో చాలా పేజీలునింపే మయ్యా. ప్రేయసిని పరీక్ష చేయడానికి. ఓసారి. మన పెళ్ళిమాటేమిటి? నాకు నావారులేరు. నీకు నీ వారులేరు. మనిద్దరం ఒకటే అని చెల్ మోహనరంగ శాణీలో అడిగాడు.

"పెళ్ళెందుకులెద్దురూ. ఇప్పుడు మనం పెళ్ళి చేసుకున్నట్లుగాదా?" అన్నది ఆవిడ. ఆ మాటకు మయ్యాకు బ్రహ్మానందం అయింది. పెళ్ళాం అంటే అసహ్యం పుట్టిన మయ్యాకు ప్రేయసి దొరికిం తరువాత-జీవితంలో లంకె బిందెలు దొరికినంత సంతోషం అయింది. పెళ్ళాంతో ఓ రకంగా రాజీ పడ్డాడు. మామూలుగా సంసారం చేస్తున్నాడు. తను చేస్తున్న వ్యభిచారం విషయం మరచిపోయినాడు. చేసుకున్న వారికి చేసుకున్నంత అనుకుని ఉద్యోగంతో కూడ రాజీ పడ్డాడు. ఎక్కువ డబ్బు ఖర్చు లేకుండా

ఓ ప్రేయసి దొరికింది అంతేచాలు. పిల్లలమీద ఎక్కడ లేని మమకారం ఏర్పడింది. ఇప్పుడు మయ్య చాలా ఉత్సాహంగా ఉంటున్నాడు. అతడిలో సమస్య లేవీ ఉన్నట్లు కన్పించడం లేదు. ఈ కథను ఇలాగే సీరియల్‌గా పొడిగిస్తే బాగుండు ననిపించింది. ఎంతలాగినా సాగుతూనే ఉంటుంది. కథగాకుండా-సీరియల్ గాకుండా ఓ పెద్ద కథగా తయారు చేశాను. కథలోని సంఘటనలతో ఈనాటి సమాజాన్ని చిత్రించాను. మధ్యతరగతి కుటుంబాల ఇక్కట్లు అంతో ఇంతో కన్పడుతూనే ఉన్నాయి. ఇవి పాఠకులకు, మయ్య భార్యమీద బోలెడంత సానుభూతి కలిగేట్లు చేశాను... అందరూ అయ్యో!... అమాయకురాలు పాపం. అనుకుండేట్టుగా కలలో కన్పించిన కొండలూ, వరదలూ కథలో తీసేశాను- అదో అర్థంలేని కలగనక, ఆ రోజుల్లో కన్పిస్తున్న ధరల పెరుగుదల, చాలీ చాలని జీతాలు, ఇరుకు ఇళ్లూ-సమాజంలో కొట్టవచ్చినట్లు ముందుకు వస్తున్న అవినీతి. అన్యాయం ఆ రాజకీయం అక్కడక్కడా చెదురు మదురుగా గుప్పించాను. కథకో పెద్ద కాన్వాస్ తయారయింది. పాత్ర పోషణకేం లోటులేదు, రచనా విధానం సాఫీగానే పోతున్నది.

ఓ విలన్ లేకపోతే కథకు అందం, నిండుతనం రాదు. ఇలా ఉంటూ ఉండగా మయ్యకు ఓరోజు ఎక్కడ నుండో ఆకాశరామన్న ఉత్తరం వచ్చింది.

మయ్యాగారికి!...మీరు వట్టి, అమాయకులు. మీరు ప్రేయసి అనుకుంటున్న ఆ భామ ప్రేయసి కాదు. మీ

పాలిట రాక్షసి. మీరు ఊబిలో పడుతున్నారు. ఇప్పటికి మీరు అయిదో వారు ఆమెకు. ఆమెకు ఉద్యోగం సద్యోగం లేదు. సంవత్సరం క్రితం బెజవాడ నుండి మకాం పెట్టింది. మీలాంటి వాళ్ళను బుట్టలో వేసుకుంటుంది. మీరు మోస పోకండి. మీ దగ్గర ఇంకా డబ్బు [illegible]లేదని భ్రమపడు తున్నారేమో- ముందున్నది ముసళ్ళ పండగ. మీరేమో సుఖంగా సంసారం చేస్తూ గుట్టుగా రోజులు గడుపుతున్నారు పాపం అమాయకులు. అడిగినంత డబ్బు ఇవ్వకపోతే మిమ్మల్ని రచ్చకీడుస్తుంది. ఇప్పటికే ఆ ప్రయత్నాలు జరుగు తున్నాయి పర్యవసానం మీరు ఊహించనంతగా ఉంటుంది. మీపై అధికారులకు, పోలీసులకు, మీ భార్యకు ఈ విషయం తెలుస్తుంది. మీరు ఆమెపై కన్నువేసినట్టు, ఓసారి బలాత్కరించినట్టు, ఒప్పుకోకపోతే హత్య చేస్తానని బెదిరించి నట్లు మీ మీద నేరారోపణ జరుగుతుంది. మరో మూడు రోజుల్లో నోటీసు రాగలదు. మిమ్మల్ని మీరు కాపాడు కోవాలనుకుంటే రేపు సాయంత్రం పార్కుదగ్గర కొంత డబ్బుతో కలుసుకోండి.

ఇట్లు,
మీ శ్రేయోభిలాషి
ఆకాశరామన్న.

ఆ ఉత్తరం చూసి పళ్ళు పటపట కొరికాడు.

ఆ ఉత్తరం రాసింది ప్రేయసో, విలనో అర్థం కాలేదు.

ఎవరైనా ఈ సమస్యను ఎదుర్కొనే ధైర్యంలేదు.

కొంత డబ్బు ముట్టచెప్పి లొంగిపోదామనే అనుకున్నాడు. మయ్యా పెళ్ళాం ఆ సమయంలో ఓ దేవతగా కన్పించింది.

ఏదో కష్టం వచ్చిందని చెప్పుకున్నాను పెళ్ళాంతో, డబ్బు అత్యావసరం అన్నాడు "మీరలా బెంబేలు పడి పోకండి. కష్టాలు మనుషులకు గాక మానులకు వస్తాయా. ఈ గాజులు తీసుకెళ్ళి. డబ్బు సర్దుబాటు చేసుకోండి." అని ఓదార్చింది ఆ ఇల్లాలు పతివ్రతగనక, మాంగల్యం కళ్ళకద్దు కుంది...

మార్వాడీ దగ్గర గాజులు తాకట్టుపెట్టి- డబ్బు తీసుకుని- పార్కు-దగ్గర ఆకాశరామన్నను కలుసుకుని - గండం గడచి బయటపడ్డాడు. మయ్యాకు పెళ్ళాం అంటే ప్రేమ. ఉద్యోగం అంటే ఆనందం - ఉన్నట్టుండి పుట్టుకొచ్చినయి. బతికుంటే బలుసాకు తినచ్చు అనుకున్నాడు. ఇప్పుడు మయ్యాకు పిల్లలంటే ప్రాణం.

ఈ కథ పూర్తిచేసి ఓ పత్రికకు పంపించాను. నా రచన అచ్చయింది. చదివిన మిత్రులు బాగుందన్నారు. ఒకటి రెండు ఉత్తరాలు కూడా అచ్చయినాయి.

"మీ (మా) పత్రిక ఇటీవల అత్యుత్తమంగా వెలువడుతున్నది. ఈ సంచికలో ముఖ్యంగా నన్నాకర్షించినది... ఫలానా కథ. నాకు చాలా నచ్చింది. వాస్తవానికి చాలా దగ్గరగా ఉంది. మయ్యా భార్యను చూస్తే చాలా జాలేసింది. రచయితకు నా అభినందనలు తెలియజేయండి."

ఈ ఉత్తరం చూసి నేను మురిసిపోయాను.

సంతోషంతో మా ఆవిడకు చూపించాను.

ఆవిడ నవ్విన నవ్వు ఇల్లంతా దద్దరిల్లిపోయింది. నీకేమన్నా పిచ్చా వెర్రా అన్నాను.

"మీరే పిచ్చివాళ్ళు... అమాయకులు. అల్ప సంతోషులు. ఆ ఉత్తరం రాసింది ఎవరనుకుంటున్నారు?" అంటూ నన్ను దగ్గరకు తీసుకుంది.

ఎంత మోసం!...అనుకున్నాను. ఆవిణ్ణి వదలలేదు.

ప్రగతి వారపత్రిక

... * * * ...